క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు సెంటర్లు ప్రారంభించండి



మిల్లర్ల వద్ద ధాన్యం ట్రాక్టర్లు

హుస్నాబాద్: రైతులు పండించిన ధాన్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశాడు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో మిల్లర్లు ఇదే అదనుగా తక్కువ ధరకు కొనుగోలు చేసి దోపిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.1600 నుంచి రూ.1700లకు కొంటూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు మిల్లర్లకు అమ్ముకుంటూ నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశాడు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సయ్య, తూముల మమత, హైకోర్టు అడ్వకేట్ ఝాన్సీ చౌదరిలు సోమవారం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న రోజుల్లో వివిధ పార్టీల నుంచి భారీగా చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి మండల జెడ్పీటీసీ గీకురి రవీందర్‌తో పాటు నాయకులు తదితరులు ఉన్నారు.

అభినందనల వెల్లువ

ములుగు(గజ్వేల్): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇటీవల ప్రభుత్వం తరఫున దళిత రత్న అవార్డును అందుకున్న ములుగు మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గజ్వేల్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొమ్ము నవీన్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ నేతలు ములుగులో సోమవారం సన్మానించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు మండల పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జుబేర్‌పాషాలు నవీన్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరిబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేకర్‌రెడ్డి, నాయకులు కనకేశ్, ఆసీఫ్, జహంగీర్, చంద్రశేఖర్, రాజు, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ సిబ్బందికి కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకంగా నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం సేకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ వనితరవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్ ఉమేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు అనుబంధాల పెంపునకు దోహదం

గజ్వేల్ సీడీపీఓ వెంకటరాజమ్మ

వర్గల్(గజ్వేల్): మాతాశిశువుల మధ్య అనుబంధం పెంపునకు సామూహిక అన్నప్రాసన, సీమంతాలు, అక్షరస్వీకారాలు నిర్వహిస్తున్నట్లు గజ్వేల్ సీడీపీఓ వెంకటరాజమ్మ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం వర్గల్ మండలం వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు, గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం పోషకాహారాన్ని అంగన్‌వాడీల ద్వారా అందజేస్తుందన్నారు. తల్లిపాల ప్రాధాన్యం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపిరెడ్డి, ఎంపీటీసీ సందీప్‌రెడ్డి, ఉపసర్పంచ్ మధుయాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ఏఎన్‌ఎం పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రోల్ మోడల్ తెలంగాణ

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే రోల్ మోడల్ అయ్యాయని, దేశ రాజకీయాల్లోకి వెళ్తున్న సీఎం కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలంతా నడిచేలా చేయాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సూచించారు. సోమవారం స్థానిక వాసవీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కి ప్రజలపై నిజమైన ప్రేమ ఉంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను వెంటనే తీసుకురావాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని, బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన మార్పులను ప్రజలకు వివరించి ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. గోదావరి జలాలతో కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తెలంగాణ మంత్రులు, ప్రజాప్రతినిధులపై మోదీ చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మోదీని గద్దెదించడం ఖాయమన్నారు. రాబోయే ఎన్నికలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఏకం చేసి ముందుకు నడిపించేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశ అనంతరం కార్యకర్తలతో కలిసి భోజనాలు చేశారు. అంతకుముందు పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో రూ.కోటి 30లక్షల వ్యయంతో చేపడుతున్న అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, నరేందర్, కనకవ్వ, జుబేదా ఖతూన్, సతీష్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ రంజిత, పట్టణ మహిళా అధ్యక్షురాలు మానస, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బాల్‌నర్సయ్య, నాయకులు అంజయ్య, కొండయ్య, భిక్షపతి, తిరుపతి, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఈటలకు లేదు

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఈటల రాజేందర్‌కు లేదని, ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలోని శోభ గార్డెన్స్‌లో ఈనెల 21న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈటల వైఖరిపై మండిపడ్డారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్‌ను విమర్శించే ముందు ఈటల ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. సమున్నత గౌరవం ఇచ్చి ఉన్నత పదవులను కట్టబెట్టిన తర్వాత కూడా బీఆర్‌ఎస్‌కు మోసం చేసిన చరిత్ర ఈటలదని చెప్పారు. ఆత్మగౌరవం అంటూ పదే పదే పలికే రాజేందర్ తన భావజాలానికి విరుద్ధమైన బీజేపీలో చేరడం దారుణమన్నారు. మోదీ, అమిత్‌షా మెప్పు పొందడానికి ఇష్టానుసారంగా మాట్లాడితే ఇక ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలోఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, సహకార సంఘం చైర్మన్ జేజాల వెంకటేశంగౌడ్, రైతుబంధు గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు మద్ది రాజిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, నాయకుల మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, పండరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మతసమరస్యానికి ప్రతీక రంజాన్

కొండపాక(గజ్వేల్): మతసమరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోని మసీదులో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌లతో కలిసి సోమవారం రాత్రి మండలంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, మైనార్టీ సొసైటీ అధ్యక్షుడు ఎండీ నవీద్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని పాలమాకులలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ 11 వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అభిషేకం నిర్వహించి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. వైదికులు డింగరి రంగాచార్యుల, సేనాపతి రామాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ పండితుడు డింగరి విష్ణుతేజాచార్యుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. అనంతరం అన్న సంతర్పణ చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పటేల్‌పుర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, సాజిద్‌పుర, శంకర్‌నగర్, సమీకృత మార్కెట్‌యార్డు, బోయగల్లి పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) పండరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

భిన్న సంస్కృతులకు నిలయం తెలంగాణ



దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం మన రాష్ట్రమని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. రంజాన్ పురస్కరించుకొని బెజ్జంకిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, ముస్లింలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



జగదేవ్‌పూర్: మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్



చిన్నకోడూరు(సిద్దిపేట): సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ రాజశేఖర్, ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుండెపోటుకు వయసుతో సంబంధం లేదని, ఏ వయసు వారికైనా రావచ్చొన్నారు. వచ్చిన వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడొచ్చని చెప్పారు. జంక్‌ఫుడ్, మద్యపానానికి దూరం ఉండాలని, ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సీపీఆర్‌పై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, కో–ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, ఎస్ఐ కృష్ణమూర్తి, తహసీల్దార్ రఘువీరారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో మరణాలు తగ్గించొచ్చు

దుబ్బాక: సీపీఆర్ విధానంతో గుండెపోటు మరణాలను తగ్గించవచ్చని దౌల్తాబాద్ మండల ఇందూప్రియల్ వైద్యాధికారిణి అశ్లేష అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్‌కుమార్, తహసీల్దార్ సుజాత, ఎంపీఓ సయ్యద్ గఫూర్‌ఖాద్రి, ఆర్ఐ మధుసూదన్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.

కొండపాక(గజ్వేల్): సీపీఆర్ చికిత్సతో ప్రాణాలను కాపాడొచ్చని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పేర్కొన్నారు. కుకునూరుపల్లి గ్రామ పంచాయతీలో కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులకు సర్పంచ్ పాల్కంపల్లి జయంతి, వైద్యుడు బల్‌బీర్‌సింగ్‌లతో కలిసి సీపీఆర్ చికిత్సపై అవగాహన కల్పించారు. అదేవిధంగా కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు సీఐ కమలాకర్ సీపీఆర్ వైద్య చికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూములుగౌడ్, ఎంపీఓ వీరరాజు, పీఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు పాల్కంపల్లి నరేందర్, పీఆర్ ఏఈ తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు. చిన్నకోడూరులో సోమవారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మీడియా రంగం ఛాలెంజింగ్‌తో కూడుకున్నదని, రాజకీయ నేతలు, మీడియాలో విధులు నిర్వహించే వారు నిత్య విద్యార్థుల్లాగా అనేక కొత్త అంశాలను నేర్చుకోవాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆయన జిల్లాకు చెందిన 72 మంది జర్నలిస్టు కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. లాటరీ పద్ధతిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు చేస్తామన్నారు. విలేకరుల బాధలు చాలా గమనించానని, వారి బాధలు తీర్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో విలేకరులుగా విధులు నిర్వహించే అందరికీ డబుల్ ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. భవిష్యత్‌లో జర్నలిస్టుల అభ్యున్నతికి శ్రాయశక్తులా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగాచారి, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ సహకారం అందిస్తా..

సిద్దిపేటజోన్: ట్రస్మా నూతన కమిటీకి సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని మంత్రి హరీశ్ భరోసా ఇచ్చారు. సోమవారం రాత్రి ట్రస్మా జిల్లా నూతన కమిటీ మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా సభ్యులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

పరామర్శ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను మంత్రి హరీశ్‌రావు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ఉన్నారు.

అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు



గ్యాస్ లీక్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రాజ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని లీడింగ్ ఫైర్‌మెన్ సికిందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా సోమవారం పట్టణంలోని కేసీఆర్‌నగర్ కాలనీలో స్థానిక ప్రజలకు వంటగదిలో జరిగే అగ్ని ప్రమాదాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలకు ఎల్‌పీజీ సిలిండర్ ప్రమాదం జరిగినప్పుడు ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలో మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ.. వంట గదిలో వంట చేసే సమయంలో అజాగ్రత్తగా ఉండరాదని, వంట గదిలోకి తగినంత గాలి, వెలుతురు వచ్చే విధంగా కిటికీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: ఎల్‌పీజీ గ్యాస్ వంట గదిలో మండే స్వభావం ఉన్న వస్తువులు పెట్రోల్, డీజిల్, కిరోసిన్ వంటివి నిల్వ ఉంచరాదని ఫైర్ ఆఫీసర్ రాజ్ కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బాలాజీనగర్ కాలనీ వాసులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ అవుట్ పోస్ట్ ఇన్‌చార్జ్ నరేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్ మహారాజుల కాలనీలో సోమవారం అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ప్రధాన అధికారి స్వామి, లీడింగ్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్ పాల్గొన్నారు.

సేవలోనే సంతృప్తి



రంజాన్ కానుకలను అందిస్తున్న వంశీధర్‌రావు

దుబ్బాక: నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని బిస్మిల్లా బైతుల్ మాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కేఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు మాట్లాడుతూ.. బిస్మిల్లా బైతుల్ మాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు సుమారు 25 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడమే కాకుండా నెల నెల రూ.200 పెన్షన్ అందించడం సంతోషకరమన్నారు. భవిష్యత్‌లో ఇంకా మరిన్నీ సేవా కార్యక్రమాలతో పేదలకు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో బిస్మిల్లా బైతుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌మియా, ఉపాధ్యక్షుడు ఖదీర్‌అలీ, తహసీల్దార్ సలీంమియా, సీఐ మున్నూరు కృష్ణ, భూంపల్లి ఎస్సై గంగరాజు, నాయకులు షబీర్ అలీ, జమీర్, ఖలీల్, రహీం, తదితరులున్నారు.

నిస్సహాయులకు చేయూతనివ్వడమే లక్ష్యం



ఫౌండేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్: నిస్సహాయులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా ఎస్ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించినట్లు ఆ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని టీపీటీఎఫ్ భవనంలో ఫౌండేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సుమన్‌కు ఆర్థికసాయం, దుబ్బాక మండలం లచ్చపేట గ్రామానికి చెందిన మహ్మద్ షాహిన్ కుటుంబానికి నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింలు, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజు, జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, జర్నలిస్ట్ బండారు రాజు, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ ముబాషిర్, ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు, కోశాధికారి ఉమర్, ఆర్గనైజర్ వెంకటేశ్, టీపీటీఎఫ్ నాయకులు వరప్రసాద్, కళాకారులు స్వామి, నవీన్, సాగర్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించే వరకు పోరాటాలు కొనసాగిస్తాం

సిద్దిపేటఅర్బన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో మేరకు క్రమబద్ధీకరణ చేయాలని జేపీఎస్‌లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని అర్బన్ మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద జేపీఎస్‌ల మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను గుర్తించి క్రమబద్ధీకరించే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వినోద్, బాల్‌రాజు, శ్రీలత, శ్రీవాణి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు మెగా జాబ్‌మేళా

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల టీఎస్‌కేసీ (తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్) కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 10గంటలలోగా అధార్‌కార్డు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాల ఆడిటోరియంలో హాజరుకావాలని కోరారు.

◆ ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ కేజీబీవీలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 వరకు విద్యార్థులు స్వయంగా పాఠశాలలో ఆధార్‌కార్డు, పాఠశాల బోనోఫైడ్‌తో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతిలో ఖాళీలను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ గ్లోబల్ ఒలింపియాడ్‌లో నెంటూరు విద్యార్థుల ప్రతిభ

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి ఈ–అభ్యాస్ అకాడమీ నిర్వహించిన గ్లోబల్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో వర్గల్ మండలం నెంటూరు విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు చక్కని ప్రతిభ చాటారని కరెస్పాండెంట్ దయాకర్, ప్రిన్సిపాల్ దేవి తెలిపారు. సోమవారం వారు వివరాలు వెల్లడిస్తూ 10 మందికి ప్రథమ, 9 మందికి ద్వితీయ, ఆరుగురికి తృతీయ బహుమతులు లభించాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

◆ రిజర్వేషన్లు అమలు చేయాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని బీఎస్పీ సిద్దిపేట నియోజకవర్గ కన్వీనర్ పుల్లూరు ఉమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీల జనాభా పెరిగిన దానికి అనుగుణంగా 12 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. మైనార్టీలకు ఇఫ్తార్ విందులు ఇవ్వడం కాదని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు అమలు చేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి యాదగిరి, జిల్లా కార్యదర్శి బాబు, నాయకులు సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

◆ బస్సుయాత్రను విజయవంతం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): సీపీఐ ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలని రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్ అన్నారు. సోమవారం మండలంలోని సలాఖపూర్, రేబర్తి, గాగ్గిళ్లాపూర్ గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగడుతూ ఇంటింటికీ సీపీఐ–పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు మద్దూరు మండలానికి ప్రజాచైతన్య బస్సుయాత్ర రానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, నాయకులు ఉడుగుల శ్రీనివాస్, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధి హామీకి నిధులు తగ్గించడం సరికాదు

మిరుదొడ్డి(దుబ్బాక): కోట్లాది మంది కూలీలకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం కేటాయించే బడ్జెట్‌లో నిధులను కేంద్ర ప్రభుత్వం తగ్గించడం సరికాదని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో నరేగ సంఘర్ష్ మోర్చా ఆధ్వర్యంలో 100 రోజుల ధర్నా కార్యక్రమం జరుగుతోంది. సోమవారం నాటికి 54వ రోజుకు చేరుకోగా ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ నుంచి ఫోన్ ద్వారా సాక్షితో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ సిస్టంను ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ఈ సిస్టంను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీలకు కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డీబీఎఫ్ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్మల, కల్పన, శాంతమ్మ, భీమప్ప, మొగులప్ప, కట్టప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ ఆరోగ్యానికి యోగా దోహదం

కొండపాక(గజ్వేల్): ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చిట్టి మాధురీరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం యోగా షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆరె భాస్కర్, ఎంపీటీసీలు అనుసూయ, లక్ష్మి, ఏఎన్ఎంలు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్డు మంజూరు చేయాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి నుంచి గండికుంట మీదుగా జయాల వరకు తారు రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ పలువురు యువకులు సోమవారం కలెక్టర్, మంత్రి హరీశ్ రావు, పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీర్ శివకుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు సందీప్, స్వామి, కమలాకర్, సురేశ్, సాయికుమార్, రాజు, పులేందర్, నర్సింహులు, గణేశ్, నవీన్‌లు ఉన్నారు.

◆ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజలతో మమేకమై బీజేపీని బలోపేతం చేసేందుకే గ్రామస్థాయి నుంచి బూత్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆపార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేవక్కపల్లెలో సోమవారం 206 బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూత్ కమిటీ ఇన్‌చార్జ్ బాల్‌రెడ్డి, నాయకులు కమలాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లికి చెందిన బీజేపీ కార్యకర్త దుద్దెడ ప్రశాంత్‌గౌడ్ తల్లి లక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, నాయకులు అంబటి బాలేశ్‌గౌడ్, స్వామిరెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ బాధిత కుటుంబాలకు ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

దుబ్బాకరూరల్: మండలంలోని రాజక్కపేట గ్రామానికి చెందిన దేవరాయ ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అదే విధంగా అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని చౌర్‌పల్లి సర్పంచ్ కుమ్మ రెంకు కుమార్ మాతృమూర్తి గండవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు బాధిత కుటుంబాలను వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో వెంకటనర్సింహ్మారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, రాజిరెడ్డి, కిషన్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.